నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 29 మే 2024 | HYDERABAD

## జూన్ 10 వరకు సమ్మర్ క్యాంపులు

### పది రోజుల పాటు గడువు పొడిగించిన జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో , మే 28(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును జూన్ 10వ తేదీ వరకు పొడిగించామని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. సికింద్రాబాద్, కూకట్‌పల్లి, చార్మినార్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్లలో ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సర్కిళ్ల వారీగా సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నది. జీహెచ్ఎంసీ వేసవి శిక్షణా శిబిరాలకు స్పందన లభిస్తోందని, దీంతో వచ్చే నెల 10వ తేదీ వరకు సమ్మర్ క్యాంపులను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు క్రీడా ప్రాంగణాలలో మెలుకువలు నేర్చుకుంటున్నారన్నారు.

విద్యార్థుల నుంచి వస్తున్న స్పందనను చూసి, వేసవి శిక్షణ తరగతులను పొడిగించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బహుమతుల ప్రదానం జోన్ల వారీగా ఉంటుందని, ఆయా తేదీలను ముందుగానే ప్రకటిస్తారని అధికారులు తెలిపారు.

## తాపాన్ని తట్టుకునేలా..

వేసవి తాపాన్ని తట్టుకునేలా నగరంలోని ఓ ఆటోవాలా.. వినూత్నంగా ఆలోచించాడు. తన ఆటోలో ఎక్కిన ప్రయాణికులకు చల్లగా ఉండేందుకు ఆటో పై భాగంలో వరి గడ్డిని ఉంచి దానిపై పాత క్లాత్‌తో కప్పి మధ్య మధ్యలో వాటర్‌తో తడుపుతున్నాడు. దీంతో ప్రయాణికులకు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం లభించింది.



## ముమ్మరంగా శిథిల భవనాల కూల్చివేతలు

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ప్రమాదకరంగా మారిన శిథిల భవనాలపై జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు సర్కిళ్ల వారీగా ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్ జోన్ల పరిధిలో 487 శిథిల భవనాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత యాజమానులకు నోటీసులు జారీ చేశారు. స్పందించిన యజమానులు ఖాళీ చేయడం, కూల్చడం, మరమ్మతులు చేపట్టడం లాంటి చర్యలు చేపట్టారు. 117 చోట్ల చర్యలు తీసుకోగా, పెండింగ్‌లో ఉన్న 370 పురాతన కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. అత్యధికంగా చార్మినార్‌లో 107, సికింద్రాబాద్‌లో 103, ఖైరతాబాద్‌లో 89 పెండింగ్ జాబితాలో ఉన్నాయి. పురాతన కట్టడాల కూల్చివేతల డ్రైవ్ కొనసాగుతుందని, వచ్చే పది రోజుల్లో డ్రైవ్ పూర్తి చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒక్క ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.




మాంసం ప్రియులకు ముక్కలేనిదే ముద్ద దిగదు. అయితే మాంసాన్ని భుజించే వాళ్లు రోజు రోజుకు అధికమవుతున్నారు. ఈ నేపథ్యంలో జంతుజాలం అంతరించిపోయే పరిస్థితి వస్తుందని ఓ స్వచ్ఛంద సంస్థ ముందస్తుగా ఆలోచించి పరిరక్షణ చర్యలు చేపట్టేందుకు అడుగులు వేసింది. కేబీఆర్ పార్క్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద శాకాహారానికి మద్దతుగా మంగళ వారం ప్రచారం చేపట్టింది.

## అన్ని సేవలు పనిచేయవు

### టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో ఆటంకాలు

#### పేరుకే అన్ని సేవలంటూ ఆర్భాటం

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): మొబైల్ యాప్ నుంచే మెరుగైన విద్యుత్ సేవలు.. కొత్త విద్యుత్ కనెక్షన్ నుంచి ఫిర్యాదుల దాకా మొబైల్‌లోనే చేసుకోవచ్చని ఎంతో గొప్పగా చెప్పిన టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో అన్ని సేవలు పనిచేయడం లేదు. ఇంట్లోంచి కాలు కదపకుండానే మొబైల్ యాప్ నుంచే సేవలను పొందేలా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) రూపొందించిన యాప్‌లో కొన్ని సేవలే అందుబాటులో ఉన్నాయి. దీంతో వినియోగదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. చేంజ్ ఆఫ్ కేటగిరి సేవలు పొందడానికి, అడిషనల్ లోడ్, చిరునామా మార్పు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, రూఫ్ టాప్ సోలార్, గ్రీన్ టారిఫ్... ఇలా 20కి పైగా సేవలు అందిస్తామని మొబైల్ యాప్‌లో సేవల వివరాలతో ఐకాన్‌లు ఉన్నా, వాటిని ఉపయోగించుకుందామంటే ఎలాంటి స్పందన రావడం లేదని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. ఇక చేసేదేమీ లేక మళ్లీ పీసీ, ల్యాప్‌టాప్ ద్వారానే సేవలు పొందుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు గుర్తించి మొబైల్ యాప్‌లో చేర్చిన రకరకాల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.




## హెచ్ఎండీఏ ప్లాట్లు.. పాట్లు

### నత్తనడకన ప్రాజెక్టుల అభివృద్ధి పనులు

- చేసిన పనులకు చెల్లింపులు లేవు
- లేఅవుట్లు, రోడ్లు, ఫ్లైఓవర్ ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం
- కోర్టును ఆశ్రయించిన తొర్రూరు ప్లాట్ల యజమానులు

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): ఒక ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టు.. ఉప్పల్ భగాయత్ లేఅవుట్.. కోకాపేట నియోపోలిస్, బాలానగర్ ఫ్లై ఓవర్, గండిపేట పార్కు, హుస్సేన్‌సాగర్ తీరంలో లేక్‌ఫ్రంట్ పార్కు.. ఇవీ హెచ్ఎండీఏ చేపట్టిన ప్రాజెక్టుల్లో మచ్చుకు కొన్ని మాత్రమే. హైదరాబాద్ మహానగర వాసులకు హెచ్ఎండీఏ అంటే ఒక నమ్మకం. ఇవన్నీ గత పదేండ్ల కాలం వరకే అన్నట్లుగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హెచ్ఎండీఏ పరిధిలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. గతేడాది ఎన్నికల కోడ్ మూలంగా నవంబర్, డిసెంబర్ నుంచే అభివృద్ధి పనులు నిలిచిపోగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా ప్రాజెక్టులను పూర్తిగా పక్కన పెట్టింది. ప్రతిపాదిత ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, పనుల్లో మాత్రం చలనం లేదు. నగర శివారు ప్రాంతాల్లో హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మౌలిక వసతుల పనుల కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్ల వంటి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా హెచ్ఎండీఏ లేఅవుట్‌లలో ప్లాట్లను ఆన్‌లైన్‌లో వేలం ద్వారా విక్రయించి సొమ్ము చేసుకున్నా, క్షేత్ర స్థాయిలో మాత్రం కనీస సౌకర్యాలు ఎందుకు కల్పించడం లేదంటూ కొనుగోలు దారులు మండిపడుతున్నారు. లేఅవుట్లు మాత్రమే కాదు.. నిజాంపేట, బాచుపల్లి ప్రాంతంలో చేపట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సైతం నత్తనడకన కొనసాగుతున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

#### కోర్టును ఆశ్రయించిన ప్లాట్ల కొనుగోలు దారులు..

నగర శివారులోని తొర్రూర్‌లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో రెండు దశల్లో ప్లాట్లను విక్రయించారు. మొదటిసారి 2022 జులైలో ప్లాట్లను ఆన్‌లైన్ వేలంలో విక్రయించారు. అప్పటి నుంచి 18 నెలల్లో లేఅవుట్‌లో పూర్తి స్థాయిలో మౌలికవసతులు రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, పార్కుల నిర్మాణం పూర్తి చేసి, అభివృద్ధి చేసిన లేఅవుట్‌ను కొనుగోలుదారులకు అప్పగించాల్సి ఉంటుంది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లేఅవుట్ అభివృద్ధి పనులు మొదలు పెట్టినా, ఆ తర్వాత 5 నెలల నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. తమకు చెల్లించాల్సిన బిల్లులు కోట్లలో ఉన్నాయని, వాటిని చెల్లించకపోతే పనులు చేపట్టలేమని కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఏడాది గడిచినా తొర్రూర్ లేఅవుట్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేయడం లేదని ప్లాట్ల యజమానులు ఆగ్రహంతో ఉన్నారు. హెచ్ఎండీఏ తీరుపై కొనుగోలు చేసిన యజమానులు కోర్టును ఆశ్రయించారు. విషయం కోర్టు దాకా వెళ్లడంతో ఆ కాంట్రాక్టరుతో చర్చించి మళ్లీ పనులు మొదలు పెట్టినా, అది ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. ఇలా ఒక్క తొర్రూరు లేఅవుట్‌లోనే కాదు... ఇతర లేఅవుట్‌లైన బహదూర్‌పల్లి, బాచుపల్లిలోని లేఅవుట్‌లను అభివృద్ధి చేసి తమకు అప్పగిస్తే గృహ నిర్మాణాలు చేసుకుంటామని కొనుగోలు దారులు హెచ్ఎండీఏ చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

#### మసకబారుతున్న హెచ్ఎండీఏ..

ప్రభుత్వం ఏర్పాటు చేసే లేఅవుట్ అంటే ప్రజలకు నమ్మకం. మాస్టర్ ప్లాన్ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో మౌలిక వసతులతో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి అప్పగిస్తారన్న మంచి పేరు హెచ్ఎండీఏకి ఉంది. కానీ హెచ్ఎండీఏలో గత ఏడాదిన్నర కాలంలో పలు చోట్ల చేపట్టిన లేఅవుట్‌లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం మారడంతో అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అయోమయానికి గురవుతున్నారు. హెచ్ఎండీఏ వెంచర్‌లో ప్లాట్లు అని లక్షలు చెల్లించి కొనుగోలు చేశారు. వేలం వేసిన తర్వాత 18 నెలల్లో లేఅవుట్లలో చేపట్టాల్సిన మౌలిక వసతులు కల్పించ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం బుద్వేల్, మోకిల లేఅవుట్‌ల అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచిన హెచ్ఎండీఏ వాటిని ఒకే కంపెనీకి సుమారు రూ. 400 కోట్లకు అప్పగించింది. ఇతర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు సైతం పూర్తి చేయకుండా ఎక్కడికక్కడే వదిలేయడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు.



మహ్మద్ విరాసత్ రసూల్ ఖాన్(ఫైల్)

## నాంపల్లి మాజీ ఎమ్మెల్యే మృతి

మెహిదీపట్నం, మే 28: ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకుడు, నాంపల్లి మాజీ ఎమ్మెల్యే మహ్మద్ విరాసత్ రసూల్‌ఖాన్(78) మంగళవారం అనారోగ్యంతో తన స్వగృహంలో కన్నుమూశారు. 2009లో నూతనంగా ఏర్పడిన నాంపల్లికి మొట్ట మొదటి ఎమ్మెల్యేగా విరాసత్ రసూల్‌ఖాన్ ఎన్నికయ్యారు. గతంలో చార్మినార్ నియోజకవర్గానికి 1989 నుంచి 1994 వరకు ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. విరాసత్ రసూల్‌ఖాన్ మృతి పార్టీకి తీరని లోటని కార్వాన్, యాఖుత్‌పురా, నాంపల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, జాఫర్ హుస్సేన్ మెరాజ్, మహ్మద్ మాజీద్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ ఖాద్రి పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



రాత్రి వేళలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులతో కాలనీవాసులు

## కొమ్మలు.. తీగలు తెగిపడితే

### విద్యుత్ పునరుద్ధరణకు.. కాలనీ వాసుల చేయూత

- భారీ ఈదురు గాలులకు చెట్లు కూలడంతో ధ్వంసమైన విద్యుత్ సరఫరా వ్యవస్థ
- సరూర్‌నగర్ సర్కిల్‌లో గంటల తరబడి పునరుద్ధరణ పనులు

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): ప్రకృతి ప్రకోపంతో విద్యుత్ వ్యవస్థ ధ్వంసమైంది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా పెట్టుకొని విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం మొత్తం అందులోనే నిమగ్నమై రాత్రి, పగలు అనే తేడా లేకుండా పని చేస్తోంది. ఇదంతా ప్రత్యక్షంగా చూస్తున్న స్థానికులు తాము సహకారం అందిస్తామంటూ వారికి అండగా నిలిచారు. రెండు రోజుల క్రితం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని హయత్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో గాలివాన దుమారానికి చాలా చోట్ల చెట్లు కూలి విద్యుత్ లైన్లు, స్తంభాలపై పడిపోయాయి. దీంతో గంటల తరబడి సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. సరూర్‌నగర్ ద్వారకామయి నగర్ కాలనీలోని రోడ్లపై చెట్లు కూలి.. కొమ్మలు 11కేవీ స్తంభాలు, ఎల్‌టీ లైన్ స్తంభాలపై పడిపోవడంతో దాదాపు ఒక కిలో మీటర్ నిడివి గల కండక్టర్ ధ్వంసమైందని సర్కిల్ విద్యుత్ శాఖ అధికారి తెలిపారు. దీనికి తోడు హెచ్‌జీ ఫ్యూజ్ సెట్, ఏబీ స్విచ్ సెల్ పూర్తిగా ధ్వంసమై సుమారు 300 వినియోగదారుల సర్వీసు వైర్లు ఎక్కడికక్కడ తెగిపోయాయి. వీటన్నింటినీ పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ యంత్రాంగం శ్రమిస్తున్న సమయంలో కాలనీవాసులు ముందుకొచ్చి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకారం అందించారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేశారు. ఇలాంటి సహకారం గ్రామాల్లోనే విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఉంటుందని, ఇది హైదరాబాద్‌లో జరగడం అరుదైన సంఘటన అని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## విద్యుత్ వైర్లు.. హరితమయం

అబిడ్స్ చిరాన్ లైన్ వద్ద విద్యుత్ వైర్లపై పర్చుకున్న పచ్చని తీగలు





## చేపపిల్లల వదిలివేతకు ఖరారు కాని టెండర్లు

### ఆందోళనలో మత్స్య సహకార సంఘాల సభ్యులు

మేడ్చల్, మే 28 (నమస్తే తెలంగాణ): మత్స్య కార్మికుల సంక్షేమానికి గాను.. చెరువుల్లో చేప పిల్లల వదిలివేతకు ప్రభుత్వం ఇప్పటి వరకు టెండర్లను ఖరారు చేయలేదని మత్స్య సహకార సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం ప్రారంభం కాకముందు చెరువుల్లో చేప పిల్లల వదిలివేతకు ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే టెండర్ల ఖరారుపై ఇప్పటి వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మత్స్యశాఖకు ఎలాంటి సమాచారం లేదు. దీంతో మత్స్య సహకార సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రతి ఏడాది జిల్లాలోని 233 చెరువుల్లో వంద శాతం సబ్సిడీపై 63 లక్షల చేపపిల్లలను వదిలే విధంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

#### బీఆర్ఎస్ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ప్రతి సంవత్సరం మత్స్య కార్మికుల సంక్షేమానికి వంద శాతం సబ్సిడీపై 60 లక్షల పైచిలుకు చేపపిల్లలను వదలడమే కాకుండా , చేపలు పట్టే పరికరాలను కూడా సబ్సిడీపై అందించింది. చేపపిల్లల విక్రయాలకు ప్రత్యేక మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో 82 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా 3,738 మంది సభ్యులు ఉన్నారు. మత్స్యశాఖ ఆధీనంలోని చెరువులను నామ మాత్రపు కౌలుపై అందించి మత్స్యకార్మికుల సంక్షేమానికి కృషి చేసింది. అయితే ఇప్పటి వరకు చెరువుల్లో చేపపిల్లలను వదిలే టెండర్లు ఖరారు కాకపోవడంతో మత్స్యసహకార సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ యేడు చెరువుల్లో చేపపిల్లలను వదులుతారా? లేదా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.



## జూన్ 2న బైస్కిల్ రైడ్

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ) : జూన్ 3న వరల్డ్ బైస్కిల్ డే సందర్భంగా జూన్ 2న హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అత్యధిక మంది సైక్లిస్టులతో రైడ్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు హెచ్‌సీజీ ఫౌండర్ రవీందర్, హెచ్‌సీఆర్ సభ్యుడు రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో సైక్లింగ్ ప్రాధాన్యతను చాటేలా ఈ రైడ్ ఉంటుందని, నగర సైక్లిస్టులందరూ ఈ రైడ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఓఆర్ఓర్ సైక్లింగ్ ట్రాక్-ఫారెస్ట్ ట్రెక్ పార్క్-ఓఆర్ఆర్ సైక్లింగ్ ట్రాక్ మార్గంలో రైడ్ జరుగుతుందని తెలిపారు. మరో రైడ్ నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్ వేదిక నుంచి సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ మీదుగా సాగనుందని రవీందర్ వివరించారు.



ఎండ వేడికి భయపడి నగరవాసులెవరూ బయటకు రాకపోవడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఎల్.వి. ప్రసాద్ రహదారి

## నిమ్స్ క్యాంటీన్ కాంట్రాక్ట్ నక్షత్రకు..

ఖైరతాబాద్, మే 28 : నిమ్స్ దవాఖాన క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలను నక్షత్ర ఏజెన్సీ దక్కించుకుంది. ప్రస్తుతం ఉన్న ప్రిజం హాస్పిటాలిటీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్ 2022 ఫిబ్రవరి 18 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 17 వరకు రెండేళ్ల గడువు ముగిసింది. అయితే మరో నెల రోజులకు గడువును పొడిగించారు. ఈలోగా కొత్త టెండర్లను పిలువగా.. ఈనెల 8 నాటికి ఆ ప్రక్రియ పూర్తయింది. ఈసారి కాంట్రాక్ట్‌ను కొత్త ఏజెన్సీ నక్షత్ర దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఈనెల 30 నాటికి క్యాంటీన్‌ను నక్షత్రకు అప్పగించాలని పాత ఏజెన్సీకి నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నోటీసు జారీ చేశారు. కాగా టెండర్ల ప్రక్రియలో ఓ ప్రభుత్వ పెద్ద జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.